## భైరవునిపల్లిలో వివాహిత హత్య

- వివాహేతర సంబంధానికి ఒప్పుకోలేదని ఘాతుకం
- వెంట తెచ్చుకున్న కత్తితో పొడిచిన నిందితుడు

కూసుమంచి (నేలకొండపల్లి), జూన్ 7: తనతో వివాహేతర సంబంధం పెట్టుకోవాలని వెంటపడుతున్నప్పటికీ ఓ వివాహిత ఒప్పుకోక పోవడంతో ఓ వ్యక్తి ఆమెను హత్యచేసిన ఘటన నేలకొండపల్లి మండలం భైరవునిపల్లిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తనతో వివాహేతర సంబంధం పెట్టుకోవాలంటూ భైరవునిపల్లికి చెందిన శ్రీను.. అదే గ్రామానికి చెందిన కోళ్ల సైదమ్మ (35)ను కొద్దిరోజులుగా వేధిస్తున్నాడు. అందుకు ఆమె అంగీకరించడం లేదు. దీంతో ఆగ్రహంగా ఉన్న అతడు.. శుక్రవారం సైదమ్మ తన ఇంట్లో ఒంటరిగా ఉండడాన్ని గమనించాడు. వెంటనే ఆమె ఇంట్లోకి వెళ్లి ఆమెతో ఘర్షణకు దిగాడు. ఆమె నిరాకరించడంతో అప్పటికే వెంట తెచ్చుకున్న కత్తిని తీసి ఆమెను పొడిచాడు. కత్తి పోట్లకు గురైన ఆమె గట్టిగా కేకలు, అరుపులతో అక్కడే కుప్పకూలిపోయింది. ఆ కేకలు, అరుపులు విన్న ఇరుగుపొరుగు వారు హుటాహుటిన అక్కడి వచ్చి చూశారు. ఈలోపే శ్రీను అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు వెంటనే ఆమెను నేలకొండపల్లి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే ఆమె మరణించినట్లు ధ్రువీకరించారు. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నేలకొండపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, సైదమ్మకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## 'గ్రీన్‌ఫీల్డ్ హైవే సమస్యలు పరిష్కరించాలి'

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వేంసూరు రైతులు

సత్తుపల్లి టౌన్/ వేంసూరు, జూన్ 7: గ్రీన్‌ఫీల్డ్ హైవే సమస్యలను పరిష్కరించాలని లింగపాలెం గ్రామ రైతులు ఎమ్మెల్యే మట్టా రాగమయి, కలెక్టర్ వీపీ గౌతమ్‌కు శుక్రవారం వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను ఎమ్మెల్యేకు, కలెక్టర్‌కు వివరించారు. ఇందుకు వారు స్పందిస్తూ ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులు ఎర్ర సత్యనారాయణ, మోరంపూడి వెంకటేశ్వరరావు, నున్న రంగారావు పాల్గొన్నారు.

## 'ఇంటర్ పరీక్షల రెమ్యూనరేషన్ చెల్లించాలి'

డీఐఈవోకి వినతిపత్రం ఇస్తున్న అధ్యాపకులు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 7: తెలంగాణ ఇంటర్ బోర్డు నిర్వహించిన ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణలో పాల్గొన్న వారికి పెండింగ్ రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని నయాబజార్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ మూల్యాంకనం కేంద్రం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 ఆధ్వర్యంలో నిర్వహించారు. రెండేళ్ల క్రితం ఇంటర్ పబ్లిక్ వార్షిక పరీక్షల, ప్రాక్టికల్, స్పాట్ విధులు అనంతరం వెంటనే సిబ్బందికి రెమ్యూనరేషన్ చెల్లించేవారని, ఇప్పుడు ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తామని చెప్పి చెల్లించకుండా చాలా ఇబ్బందులు గురిచేస్తున్నారని అన్నారు. వెంటనే రెమ్యూనరేషన్ చెల్లించాలని కోరుతూ డీఐఈఓ రవిబాబుకి వినతిపత్రం అందజేశారు. సంఘం బాధ్యులు డాక్టర్ కొప్పిశెట్టి సురేశ్, మల్లయ్య, వినోద్‌బాబు, శ్రీకాంత్, నరసింహారావు పాల్గొన్నారు.

## 'జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలి'


డీఈవోతో మాట్లాడుతున్న టీయూడబ్ల్యూజే బాధ్యులు

రఘునాథపాలెం/ ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 7: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) నాయకులు కోరారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం డీఈవో సోమశేఖరశర్మను, డీఐఈవో రవిబాబును వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. దీనిపై డీఈవో స్పందిస్తూ 50 శాతం రాయితీ కల్పించాలని తక్షణమే సర్క్యులర్ జారీ చేస్తామని, జర్నలిస్టుల పిల్లలకు తప్పక 50 శాతం రాయితీ అందించాలని ప్రైవేటు విద్యాసంస్థలన్నింటికీ తెలియజేస్తామని హామీ ఇచ్చారు. సంఘం నాయకులు చిర్రా రవి, గుద్దేటి రమేశ్‌బాబు, రజినీకాంత్, మందుల ఉపేందర్, భాస్కర్, టీఎస్ చక్రవర్తి, పిన్ని సత్యనారాయణ, షేక్ జానీపాషా, పేరబోయిన తిరుపతిరావు, కొరకొప్పుల రాంబాబు, బిక్కి గోపి, జగదీశ్, అశోక్, ఈశ్వరి, భారతి, కోటేశ్వరరావు, శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

**ప్రకటన**

ఇందుమూలముగా నాకొయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **నేలకొండపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింద షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **సురభి సుజాత**, W/o : **వీరభద్రం**, **వయస్సు** : 42 సం॥లు, **వృత్తి** : గృహిణి, **నివాసం** : ఇ.నెం. 3-83, మల్లేపల్లి గ్రామము, కూసుమంచి మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

**షెడ్యూలు ఆస్తి** : ఖమ్మం జిల్లా అశ్వారెన్నుల రిజిస్ట్రారు మరియు కూసుమంచి సబ్ రిజిస్ట్రారు వారి పరిధిలోని, ఖమ్మం రెవిన్యూ జిల్లా, కూసుమంచి రెవిన్యూ మండల పరిధిలోని, గంగబండ తండ గ్రామ పంచాయితీ పరిధిలోని, కూసుమంచి రెవిన్యూ గ్రామములోని, సర్వే నెం. 383/ఈ3/1/1 మింజుమలె, నివేశన స్థల విస్తీర్ణం 362.05 చ॥గ॥ లేక తత్సమానం. 302.72 చ॥మీ॥, **డాక్యుమెంట్ నెం. 888/2024** గల అట్టి విక్రయాస్తికి సరిహద్దులు : **తూర్పు:** వడిత్య మానమ్మ గారి ఖాళీ స్థలము, **పడమర :** కూసుమంచి నుండి నేలకొండపల్లి వెళ్ళు ఆర్ & బి రోడ్డు, **ఉత్తరం** : తేజావత్ శ్రీనివాసరావు గారి ఖాళీ స్థలం, **దక్షిణం** : వడిత్య నాగేశ్వరరావు గారి ఇల్లు.

**జి.హరేందర్ రెడ్డి**
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

## 'గ్యాస్ ఈ-కేవైసీకి 30 తుది గడువు'

మధిర, జూన్ 7: మధిర, ఎర్రుపాలెం, బోనకల్లు మండలాలకు చెందిన హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం ఈ నెల 30లోపు తమ గ్యాస్ కనెక్షన్లకు ఈ-కేవైసీ చేయించుకోవాలని మధిర శ్రీసాయివెంకటేశ్వర హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ డీలర్ దోసపాటి కల్యాణి శుక్రవారం తెలిపారు. ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోని వినియోగదారులకు గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. ఇప్పటికే ఈ-కేవైసీని పూర్తి చేసుకోని వినియోగదారుల ఇంటికి తమ సిబ్బంది వస్తారని అన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

సత్తుపల్లిలో..

మధిరలో..

ముదిగొండలో..

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

### 'బడిబాట' కార్యక్రమాల్లో డీఈవో సోమశేఖర శర్మ, ఉపాధ్యాయులు

చింతకాని/ ముదిగొండ/ మధిర/ సత్తుపల్లి, జూన్ 7: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని డీఈవో సోమశేఖర శర్మ, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. అందుకని తల్లిదండ్రులందరూ తమ చిన్నారులను సర్కారు బడులలోనే చేర్పించాలని కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా చింతకాని మండలంలో శుక్రవారం డీఈవో పర్యటించారు. మధిర, ముదిగొండ మండలాలు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పర్యటించారు. ఆయా గ్రామాల్లో బడిబాట ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న మెరుగైన విద్య గురించి, సర్కారు కల్పిస్తున్న సౌకర్యాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో డీఈవో, ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత ఏకరూప దుస్తులు, పోషక విలువతో కూడిన భోజనం వంటివి లభిస్తాయని అన్నారు. నిపుణులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందుతుందని తెలిపారు. చింతకాని మండలంలో డీఈవో సోమశేఖరశర్మ, హెచ్ఎంలు శ్రీనివాసరావు, శైలజ, సీఆర్పీ బత్తుల తిరపయ్య, ఏఏపీసీ చైర్మన్లు, ఉపాధ్యాయులు, ముదిగొండలో ఎంఈవో రామాచారి, ఎంపీడీవో శ్రీధర్ స్వామి, కార్యదర్శి సంపత్, ఉపాధ్యాయులు, మధిరలో మాజీ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు నిడమనూరు సంధ్యవంశీ, ఊట్ల శంకర్‌రావు, ఊట్ల రాధాకృష్ణ, భూలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు. సత్తుపల్లి ఎన్టీఆర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బడిబాట నిర్వహించి పలువురు చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించారు.

చింతకాని మండలంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న డీఈవో సోమశేఖరశర్మ

## 'కారేపల్లి'లో మొక్కుబడిగా 'బడిబాట'

- ప్రవేశాల కోసం 'ప్రైవేట్' యాజమాన్యాల విస్తృత ప్రచారం
- పట్టించుకోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధికారులు

కారేపల్లి, జూన్ 7: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6 నుంచి బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. అయితే మండల వ్యాప్తంగా కొన్ని చోట్ల ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు గ్రామాల్లో పర్యటించి 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించడం బడిబాట ముఖ్య ఉద్దేశం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్య గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం లేదు. విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్న ఏకరూప దుస్తులు,పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఉపకార వేతనాలు, డిజిటలైజేషన్ తరగతులపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చే విధంగా కృషి చేయాలి. కానీ క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు అలా చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఒకవైపు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ టీచర్లు, సిబ్బంది ద్వారా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారాలు చేస్తూ ప్రవేశాలు తీసుకుంటున్నారు. కానీ విద్యాశాఖ అధికారులు మత్రం పూర్తిస్థాయిలో దృష్టిసారించడం లేదు. దీంతో బడిబాట కార్యక్రమం మొక్కుబడిగానే సాగుతోంది.

### సక్రమ నిర్వహణకు కృషి చేస్తాం

బడిబాట కార్యక్రమం మొదలై రెండు రోజులే అయ్యింది. ప్రధాన ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి బడిబాట కార్యక్రమాన్ని సక్రమంగా కొనసాగేలా కృషి చేస్తాం.
**-జయరాజు, ఎంఈవో, కారేపల్లి**

## 'చాంబర్ కడుపు సల్లంగుండ'

- కార్మికులు, కర్షకులకు నిత్యం మజ్జిగ పంపిణీ
- వ్యాపారుల సేవానిరతి పట్ల నగరవాసుల హర్షం

మజ్జిగ పంపిణీ చేస్తున్న వర్తక సంఘం పెద్దలు

ఖమ్మం వ్యవసాయం, జూన్ 7: చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపారుల సేవను చూసి ప్రజలు, నగరవాసులు చాంబర్ కడుపు సల్లగుండ అంటున్నారు. వేసవిలో బాటసారులకు మజ్జిగ పంపిణీ చేస్తుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకెళ్తే.. నెలరోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదైన సంగతి తెలిసిందే. వివిధ ప్రాంతాల ఖమ్మం నగరానికి వస్తున్న వందలాది మంది ప్రజలు, నగరవాసులకు మజ్జిగ పంపిణీ చేయాలని వ్యాపారులు భావించారు. ఖమ్మం వర్తకసంఘం అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షుడు జీవై నరేశ్, కోశాధికారి తల్లాడ రమేశ్, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ ఇతర వ్యాపారులతో కలిసి చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం ఎదురుగా నిత్యం మజ్జిగ పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. దీనికి ప్రతిరోజు 200 లీటర్ల మజ్జిగను కొనుగోలు చేసి కొత్తిమీర, ఇతర పదార్థాలు కలిపి రుచికరమైన మజ్జిగను పంపిణీ చేస్తున్నారు. ఇందుకు సుమారు ప్రతిరోజు రూ.10 వేల ఖర్చు అవుతుండగా 7 నుంచి 8 వందల మంది దాహార్తి తీరుస్తున్నారు. ఒకవైపు వ్యాపారాలు కొనసాగిస్తూనే మధ్యాహ్నం వేళ ఉచిత మజ్జిగ పంపణీలో పాల్గొంటున్న చాంబర్ ఈసీ సభ్యులు, ఇతరశాఖల వ్యాపారుల చొరవ ప్రతిఒక్కరిని ఎంతగానో ఆలోచింపజేస్తున్నది.

## 'డీసెట్' దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 7: డీఈడీ కోర్సులో ప్రవేశాల కోసం జూలై 10న నిర్వహించే ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షకు సంబంధించి డీసెట్‌కు దరఖాస్తులను ఈ నెల 8 నుంచి ఆహ్వానిస్తున్నట్లు డీఈవో సోమశేఖరశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30 వరకు గడువు ఉందని చెప్పారు. ఇతర వివరాల కోసం వెబ్‌సైట్‌లో పరిశీలించాలని కోరారు.

## కొనసాగుతున్న 'దోస్త్' ప్రవేశాలు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 7: 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రీ కోర్సుల్లో చేరే విద్యార్థులు మొదటి విడత ప్రవేశాలకు సంబంధించి సీట్లు పొందిన వారు ఈ నెల 12లోపు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా శుక్రవారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సకాలంలో నమోదు చేయకపోతే సీటు కోల్పోతారని వెల్లడించారు. రెండోవిడత ప్రవేశాలకు ఈ నెల 13 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

## నేలకొండపల్లిలో మోస్తరు వర్షం

కూసుమంచి (నేలకొండపల్లి), జూన్ 7: నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో వాతావరణం చల్లబడి వర్షాలు మొదలవుతుండడంతో రైతులు సాగు పనులను కూడా ముమ్మరం చేశారు. పచ్చిరొట్ట విత్తనాల చల్లడం ప్రారంభించారు. ఇక చేలల్లో దుక్కులు దున్నడం, చెత్తాచెదారాన్ని తొలగించడం, చేనంతటినీ శుభ్రం చేయడం వంటి పనులను జోరుగా చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే పత్తి విత్తనాలు విత్తేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

## నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిళ్లగూడెం, జూన్ 7: లైన్ల మరమ్మతుల కారణంగా ఖమ్మం నగరంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎన్‌పీడీసీఎల్ టౌన్-1 ఏఈఈ మౌళిక, టౌన్-5 ఏఈఈ జే.ప్రభాకర్‌రావు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. టౌన్-1లో 33/11 కేవీ దానవాయిగూడెం, టౌన్-5లో రామాలయం సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు.

**చింతకానిలో..**

చింతకాని, జూన్ 7: మండలంలో నాగులవంచ, పందిళ్లపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ ఏఈ అన్నారపు ఉమామహేశ్వరి తెలిపారు.

**కూసుమంచిలో..**

కూసుమంచి, జూన్ 7: కూసుమంచి సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలకు అంతరాయం కలుగుతుందని ఏఈ గ్రేసీ సుజన్ శుక్రవారం తెలిపారు.

## పనులు వేగవంతం చేయాలి

### సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజు

ఆర్ఆర్ సెంటర్లను పరిశీలిస్తున్న సింగరేణి జీఎం షాలెంరాజు

సత్తుపల్లి, జూన్ 7: మండలంలోని జగన్నాథపురం ఆర్ఆర్ సెంటర్లలో పనులను వేగవంతం చేయాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం ఎం షాలెంరాజు అధికారులను ఆదేశించారు. ఆర్ఆర్ సెంటర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, దేవాలయం, చర్చి, కమ్యూనిటీహాల్, అంగన్‌వాడీ స్కూల్ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కిష్టారం ఓసీ వద్ద వై జంక్షన్ వద్ద రోడ్డుపై జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని వాహనదారులకు రక్షణ సూచికలు, స్పీడ్ బ్రేకర్లు, రోడ్డు అంచులు సూచించే విధంగా రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కిష్టారం ఓసీ పీవో నర్సింహారావు, సివిల్ ఆఫీసర్ రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

## 22 నుంచి కోదండ రాయాలయ స్వర్ణోత్సవాలు

శ్రీకోదండ రామాలయం

సత్తుపల్లి టౌన్, జూన్ 7: పట్టణంలోని శ్రీకోదండ రామాలయం నిర్మించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 22 నుంచి స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కొత్తూరు సత్యనారాయణ, అనుమోలు సురేశ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు రామాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. 22 నుంచి స్వర్ణోత్సవాలు ప్రారంభమవుతాయని, ఆ రోజు అద్భుత శాంతి మహాసంప్రోక్షణ హోమం నిర్వహించనున్నామని తెలిపారు. 22న మూలవిరాట్‌లకు అభిషేకం, సాయంత్రం పుష్పయాగం, 23న హనుమాన్‌చాలీసా, సాయంత్రం 6 గంటలకు శ్రీసీతారామ కల్యాణం, శ్రీనివాస కల్యాణం, 24న శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయం నిర్మించిన నాటి నిత్య పూజలు చేస్తున్నామన్నారు. చివరి రోజు 24న మధ్యాహ్నం 12 గంటల నుంచి నారాయణసేవ, అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం మంగళవాయిద్యాలతో స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తామని తెలిపారు.

## 'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి'

శ్రీకోదండ రామాలయం

మధిర, జూన్ 7: ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మాటూరు పేట పీహెచ్‌సీ వైద్యుడు వీరబాబు సూచించారు. మండలంలోని నాగవరప్పాడు, ఖాజీపురం, కేసీఆర్‌కాలనీ గ్రామాల్లో ఎన్‌సీడీ స్క్రీనింగ్, ఫ్రైడే-డ్రైడే, డీ వాటరింగ్ క్యాంపులను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం, మంగళవారం గ్రామాల్లో డ్రైడేను పాటించాలని సూచించారు. అలాగే, డీ వాటరింగ్, దోమల నిర్మూలన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే, పరిసరాల పరిశుభ్రత, జ్వరాల నివారణ తదితర అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. 30 ఏళ్లు దాటిన వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించాలని, కొత్తగా వచ్చిన వారికి తగిన జాగ్రత్తలు, ఆరోగ్య సలహాలు, మందులు అందించాలని ఆదేశించారు. హెల్త్ సూపర్‌వైజర్ భాస్కర్‌రావు, ఏఎన్ఎం సత్యవాణి, సరస్వతి, రాజ్యలక్ష్మి, ఆశాకార్యకర్తలు అరుణకుమారి, దివ్య, అక్తర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి: సీపీఎం

కారేపల్లి, జూన్ 7: లోక్‌సభ ఎన్నికలు ముగిసినందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలనపై దృష్టి పెట్టి ప్రజాసమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు భూక్యా వీరభద్రంనాయక్ కోరారు. కారేపల్లిలోని భాగం రామనర్సయ్య భవన్‌లో తలారి దేవప్రకాశ్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన తమ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలన్నింటి అమలు చేయకపోతే ప్రజలకు చైతన్యం కల్పించి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. పార్టీ నాయకులు కొండబోయిన నాగేశ్వరరావు, నరేంద్ర, రామారావు, మంగయ్య, కొండయ్య, దాసరి మల్లయ్య, ధనమ్మ, వెంకన్న, రవి, శోభన్, సర్వయ్య పాల్గొన్నారు.

## 'రాయితీ విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలి'

ఖమ్మం రూరల్, జూన్ 7: దళిత, గిరిజన రైతులకు రాయితీపై విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకుడు, ఏఐపీకేఎస్ జిల్లా అధ్యక్షుడు మలీద్ నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. రైతులు సమస్యలపై తమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాంప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల పంటలకు బీమా వర్తింపజేయాలని, ఆ ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రైతుల పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు వెంకయ్య, కుర్రా వెంకన్న, ఉపేందర్, కూరాకుల పుల్లయ్య, నకిరి వెంకటయ్య, పుచ్చకాయల శ్రీనివాసరావు, మహాంకాలి వెంకన్న,మారుతి మల్లయ్య పాల్గొన్నారు.

## రైతు మృతికి పలు పార్టీల నాయకుల నివాళి

తిరుమలాయపాలెం, జూన్ 7: మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన రైతు కాంపాటి రమేశ్ (48) ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. అందరితోనూ కలుపుగోలుగా ఉండే ఇతడు మరణించాడన్న విషయం తెలుసుకున్న పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి శుక్రవారం అతడి నివాసానికి వెళ్లి అతడి మృతదేహానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు పులుగుజ్జు వెంకటేశ్వర్లు, చామకూరి రాజు, కొమ్ము శ్రీను, పద్మనాభుల సుధాకర్, దొండేటి ఆనందరావు, కాంపాటి బాబురావు, పరికపల్లి చంద్రశేఖర్, పసలాది ముత్తయ్య, తాత రవీందర్, కమ్మకొమటి నాగేశ్వరావు, పులుగుజ్జు వెంకటస్వామి, నవీన్, దొడ్డ గురవయ్య, తాతా భిక్షమయ్య తదితరులు ఉన్నారు. రమేశ్ అంత్యక్రియల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 'ప్రజాతంత్ర శక్తుల బలోపేతమే లక్ష్యం'

పెనుబల్లి, జూన్ 7: ప్రజాతంత్ర శక్తులను బలోపేతం చేయడమే తమ పార్టీ లక్ష్యమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. మండలంలోని లంకపల్లిలో జరుగుతున్న సీపీఎం రెండోరోజు రాజకీయ శిక్షణ తరగతుల్లో శుక్రవారం ఆమె మాట్లాడారు. వ్యవసాయ కార్మికుల, రైతులు, మధ్యతరగతి ప్రజలను సంఘటితం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం తమ పార్టీ పోరాడుతుందని అన్నారు. సీపీఎం నాయకులు గాయం తిరుపతిరావు, చలమాల విఠల్‌రావు, గుడిమెట్ల బాబు, చలమాల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## 'నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

సత్తుపల్లి టౌన్, జూన్ 7: నిజమైన భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్ర బోర్డుకు విజ్ఞప్తి చేశారు. ఈ